క్లుప్తంగా

నేడు బీకేపాలెంలో జగనన్న సురక్ష

కాకుమాను: మండలంలోని బీకేపాలెం గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జి.ప్రసాదరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామస్తులు తమ సమస్యల్ని అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన కోరారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు



ప్రత్తిపాడు: మండలంలోని పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థులకు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన క్యాప్ జెమిని సీనియర్ అసోసియేట్ పి.వి. సురేష్ ఉద్యోగావకాశాల్ని దక్కించుకునే విధానం, విద్యార్థి దశ నుంచి ప్రణాళిక, రెజ్యూమ్, కంపెనీల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ జి. అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసకుమార్, డీన్ జి. కిశోర్‌బాబు, పి. రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించాలి



కొమ్మూరు(కాకుమాను): విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించేదుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఎంఈఓ కెఎఫ్.కెనడీ చెప్పారు. మండలంలోని కొమ్మూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక పరీక్షను శుక్రవారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ప్రాథమిక పరీక్షలు ఎంతగానో దోహద పడతాయని ఆయన తెలిపారు. పరీక్షల ఫలితాల ఆధారంగా విద్యార్థుల్ని ఏ,బీ,సీ,డీ గ్రూపులుగా విభజించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. సీ,డీ గ్రూపుల్లోని వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిని ఏ గ్రూపులోకి వచ్చే విధంగా కృషి చేయాలని ఆయన సూచించారు.అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

విజ్ఞాన్ వర్సిటీ అధ్యాపకుడికి గ్రాంటు



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని అప్లైడ్ సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన ప్రొఫెసర్ దేవునూరి నాగరాజుకి న్యూఢిల్లీలో గల సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) నుంచి రూ.21 లక్షల గ్రాంటు మంజూరైందని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. '' సిక్స్- ఫోల్డ్ ఎఫికసీ ఆఫ్ ప్రోలైన్ యాంకర్డ్ మెల్లిటిక్ యాసిడ్ ఆర్గనో క్యాటలిస్ట్స్: ఏ యూనిక్ అప్రోచ్ ఫర్ సస్టేనబుల్ అసిమెట్రిక్ క్యాటాలిసిస్ '' అనే అంశంపై పరిశోధనకు గాను రాబోయే మూడు సంవత్సరాలకు ప్రాజెక్ట్ గ్రాంటు మంజూరైందని వివరించారు. సీఎస్ఐఆర్ ప్రాజెక్ట్ గ్రాంటు సాధించిన దేవునూరి నాగరాజును, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

క్రీడాకారుడు పవన్‌కుమార్‌కు అభినందన



పెదకాకాని: ఇటీవల జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి వాకో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో భాగంగా నిర్వహించిన కర్రసాము పోటీల్లో పత్తి పవన్‌కుమార్ గోల్డ్, బ్రాంజ్ మెడల్స్ సాధించాడు. ఆయన వెనిగండ్ల రైతు భరోసా కేంద్రంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయన్ను కలెక్టర్ నాగార్జునరెడ్డితో పాటు జాయింట్ కలెక్టర్ ఎన్. రాజకుమారి, జిల్లా వ్యవసాయాధికారులు అభినందించారు.

'జగనన్న గోరుముద్ద'లో మెనూ అమలు తప్పనిసరి

ప్రత్తిపాడు: జగనన్న గోరుముద్ద మెనూను కచ్చితంగా అమలు చేయాలని, లేనిపక్షంలో ఏజెన్సీలను తొలగిస్తామని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి హెచ్చరించారు. ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెం ఏపీ ప్రాథమిక పాఠశాల్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం అమలు, నాణ్యత, విద్యార్థుల హాజరు తదితరాల్ని పరిశీలించారు. భోజన నాణ్యతలో రాజీ పడొద్దని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం బలవర్ధకమైన పదార్థాలతో మెనూను అమలు చేస్తోందన్నారు. నిర్ణీత మెనూ ప్రకారమే ఏజెన్సీలు రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు వండించాలని ఆదేశించారు. అమలు కాకపోతే హెచ్ఎంలు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సబ్జెక్టు టీచర్లను కేటాయించండి

పాఠశాలలో సబ్జెక్టు టీచర్లను కేటాయించాలని తుమ్మలపాలెం గ్రామస్తులు ఎంఈవో సీహెచ్. రమాదేవికి విన్నవించారు. స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో గ్రామ నాయకుడు ఏసోబు శుక్రవారం సాయంత్రం ఎంఈవోను కలసి సమస్యను వివరించారు. స్థానిక యూపీ పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిది వరకు సుమారు వంద మంది విద్యార్థులు చదువుతున్నారని, హిందీ, తెలుగు సబ్జెక్టులకు టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.హెచ్ఎం చిన్నముక్కంటిని అడిగితే హిందీ, తెలుగు మా సబ్జెక్టులు కావని, తామైతే బోధించలేమని చెబుతున్నారని తెలిపారు. పిల్లలంతా టీసీలు తీసుకుని పల్నాడు జిల్లాలోని ఉన్నవ హైస్కూలుకు వెళుతున్నారని వాపోయారు. స్పందించిన ఎంఈవో రమాదేవి వెంటనే పాఠశాల హెచ్ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమెకు కూడా ప్రధానోపాధ్యాయుడు అవే సమాధానాలు చెప్పడంతో, పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులంతా ఇదే విషయాన్ని లిఖితపూర్వకంగా రాసివ్వాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల సంఖ్య ఆధారంగా సరిపడినంత మంది ఉపాధ్యాయులు పాఠశాలలో ఉన్నారని, అవసరమైతే మరో ఉపాధ్యాయుడిని యూపీ స్కూల్‌కు డెప్యూటేషన్ వేస్తామని ఎంఈవో హామీ ఇచ్చారు.



జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో రమాదేవి

సంక్షేమ సారథి సీఎం జగన్

ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా

పట్నంబజారు: సంక్షేమ సారథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 7, 12 డివిజన్లలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా, నగర మేయర్ కావటి శివనాగమనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్లు షేక్ షజిల, వనమా బాలవజ్రబాబు పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ సంక్షేమాన్ని ప్రజల ఇంటి వద్దకు చేరుస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నగరాభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. డెప్యూటీ మేయర్ షేక్ షజిల మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు.

డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ గతంలో ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేందని, ఇప్పుడు అటువంటి పరిస్థితి లేకుండా వలంటీర్లే నేరుగా ఇంటికే తెచ్చి ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరి ఫాతిమా, 12వ డివిజన్ అధ్యక్షుడు సలీం, కార్పొరేటర్ చిష్టి, క్లస్టర్ ఇన్‌చార్జిలు నాగేశ్వరరావు, ఫారూఖ్, గులాం రసూల్, రాజేశ్వరి, లియాఖత్ ఆలి, డీసీ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి తదితరులు

పొన్నూరు పట్టణాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు పట్టణాభివృద్ధికి చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం భవన యజమానులకు పొన్నూరు పురపాలక సంఘం ఆధ్వర్యంలో జీబీసీ రహదారి అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం జీబీసీ రహదారి అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి కూరగాయల మార్కెట్ సెంటర్ వరకు రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. విస్తరణలో స్థలాలు, భవనాలు కోల్పోయిన యజమానులకు టీడీఆర్ బాండ్స్‌తో పాటు, నగదును పరిహారంగా అందిస్తామని చెప్పారు. బాండ్స్‌ను రాష్ట్రంలో ఎక్కడైనా విక్రయించుకోవచ్చని తెలిపారు. సుమారు 168మంది భవన యజమానులకు ప్రభుత్వం పరిహారం అందిస్తామని చెప్పారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగుల వెడల్పుతో రోడ్డు అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఆర్ అండ్ బీ అధికారుల అంచనాల ప్రకారం రహదారి అభివృద్ధికి రూ.26 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. తొలి విడతగా రూ.5.50 కోట్లు విడుదలైనట్లు చెప్పారు. కార్యక్రమంలో పొన్నూరు తహసీల్దారు శ్రీకాంత్ కేదారినాథ్, తెనాలి ఆర్ అండ్ బీ డీఈ నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ శ్రీనివాసరావు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

వృద్ధులు, యాచకులకు అన్నదానం



చేబ్రోలు: పొన్నూరులో శుక్రవారం పలువురు వృద్ధులు, యాచకులకు అన్నదానం చేసినట్లు కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాట్రగడ్డ విజయకుమార్ తెలిపారు. విజయవాడ వారి ఆర్థిక సాయంతో పొన్నూరులోని అమ్మ సేవా నిలయంతో పాటు కసుకర్రు గ్రామంలోని 12 మంది వృద్ధులకు, నిడుబ్రోలు రైల్వే స్టేషన్‌లో 25 మంది యాచకులకు, అనాథలకు అన్నదానం చేసినట్లు ట్రస్టు చైర్మన్ తెలిపారు. దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడు నూర్ భాషా అల్లా బక్షు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వివాహిత అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సిద్ధార్థనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన వివాహిత ఈ నెల 13న ఇంట్లోంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విజయపురి కాలనీలో యువతి...

యవతి అదృశ్యంపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయపురి కాలనీలో నివసించే ఓ కుటుంబానికి చెందిన 22 సంవత్సరాల యువతి ఈ నెల 12న ఇంట్లోంచి వెళ్లిపోయింది. వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజా ప్రతినిధుల ఫిర్యాదుల్ని తక్షణం పరిష్కరించండి

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ప్రజా ప్రతినిధుల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల్ని సంబంధిత విభాగాధిపతులే ప్రత్యక్షంగా పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో నగర కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర సమగ్ర అభివృద్ధి సాధ్యమని చెప్పారు. కార్పొరేటర్లు ప్రతిపాదించిన వాటిలో మౌలిక వసతులకు సంబంధించిన వాటికి వెంటనే అంచనాలు సిద్ధం చేసి, ప్రతిపాదనలు పంపాలని ఆయా విభాగాధిపతులకు కమిషనర్ సూచించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా స్థానిక ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై తనతో చర్చించడానికి ప్రత్యేక సమయం కావాలని కోరిన దృష్ట్యా ప్రతి శుక్రవారం చర్చించేందుకు అవకాశాన్ని కల్పించినట్లు ఆమె చెప్పారు. మిగిలిన రోజుల్లో కూడా కార్పొరేటర్లు తమ డివిజన్‌లోని సమస్యల్ని వాట్సప్ లేదా ఫోన్ ద్వారా తెలిపినా కూడా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు వారికి తెలిపేలా అధికారుల్ని ఆదేశించినట్లు కమిషనర్ పేర్కొన్నారు.



కార్పొరేటర్ల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

ఇస్రో శాస్త్రవేత్తల కృషి అనితరసాధ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం (షార్) నుంచి చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం వెనుక ఇస్రో శాస్త్రవేత్తల కృషి దాగి ఉందని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు జి. శాంతమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,750 కిలోల బరువు గల చంద్రయాన్-2 మాడ్యూల్, ల్యాండర్, రోవర్లతో కూడిన రాకెట్ లాంచర్‌ను ఇటీవల శ్రీహరికోట సందర్శనలో భాగంగా తిలకించినట్లు ఆయన పేర్కొన్నారు. దేశానికే గర్వకారణంగా నిలిచిన ఇస్రో భావి శాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. శాస్త్రవేత్తలు పట్టుదలతో అనితర సాధ్యమైన విజయాన్ని సాధిస్తున్నారని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ

పాత గుంటూరు: కొత్తపేట శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి, సుభద్రా బలరామ సమేత శ్రీ జగన్నాథ స్వామికి శుక్రవారం మహిళలు సారె సమర్పించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ జరిపారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. శ్రీనివాసరావు, చైర్మన్ పిచ్చల జయప్రకాశ్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వీర వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, అర్చకులు అయ్యప్ప పాల్గొన్నారు.

• అరకెనక అరక కట్టి..



గ్రామాల్లో ఎద్దుల గంటల సవ్వడులు వినిపిస్తున్నాయి. వ్యవసాయ పనులు ఆరంభం కావడంతో కాడి పట్టి రైతన్నలు హలాలతో పొలంబాట పడుతున్నారు. అరకలు కట్టి, నాగలి పట్టి.. వ్యవసాయం చేస్తున్నారు. కాలం మారుతున్న కొద్దీ కాడెద్దులు కరుమరుగై, వ్యవసాయ యాంత్రీకరణ దూసుకొస్తున్న తరుణంలో ఇలా అరకెనక అరక కట్టి ఎద్దుల జతలు వరుసగా రావడం గ్రామీణ ప్రాంతాల్లో అక్కడక్కడా కనిపిస్తోంది. ఈ చిత్రం ప్రత్తిపాడు మండలం గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డులో కోయవారిపాలెంలో శుక్రవారం కనిపించింది. -ప్రత్తిపాడు

17నుంచి దళిత బహుజన చైతన్య సదస్సులు

నెహ్రూనగర్: దళిత బహుజన చైతన్య సదస్సుల పేరిట ఈనెల 17 నుంచి ఆగస్టు 6 వరకు కారంచేడు, చుండూరు మృతవీరుల సంస్మరణ సభల్ని గ్రామగ్రామాన జరపాలని భీమ్ భారత రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యకర్తలతో కలసి చుండూరు, కారంచేడు మృతవీరుల సంస్మరణ సభ కరపత్రాల్ని విడుదల చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలతో పాటు అత్యాచారాలు, అవమానాలకు గురవుతున్న కులాల్ని ఏకం చేసేందుకు ఈ సమావేశాలు ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బోరుగడ్డ విల్సన్‌రాజ్, దొడ్డ రాజేంద్రప్రసాద్, జల్ది మోహన్, నేలటూరి రత్నం, పిల్లి శ్యాం, మామిడి సునీల్, ఎర్రగుంట్ల సుజాతారావు, బాజీ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి నారాకోడూరు హైస్కూలు విద్యార్థినుల ఎంపిక

చేబ్రోలు: నారాకోడూరు జెడ్పీ హైస్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం ఎం. ఏడుకొండలు శుక్రవారం తెలిపారు. పొన్నూరు అసెంబ్లీ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్లలో అత్యధిక మార్కులతో ప్రథమ స్థానం సాధించిన దాసరి భానుశ్రీ (586 మార్కులు), డి. భరణి (584 మార్కులు) నూజివీడు ట్రిపుల్ ఐటీకి మెరిట్ కోటాలో ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థినుల్ని ఉపాధ్యాయులు, విద్యాకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించినట్లు ఆయన తెలియజేశారు.

రేపు జుట్టు సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: డాక్టర్ పరుచూరి రాజారామ్ మెమోరియల్ స్కిన్ అండ్ లేజర్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ స్నేహ కోవి చెప్పారు. స్థానిక కొత్తపేట కుగ్లర్ హాస్పటల్ రోడ్డులోని లేజర్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేడు పిల్లలు, పెద్దవారు అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారు జుట్టు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. వైద్య రంగంలో వచ్చిన అత్యాధునిక వైద్య పద్ధతులు, మందులతో వల్ల హెయిర్ సంబంధిత సమస్యల్ని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. నిపుణులైన వైద్యుల్ని మాత్రమే సంప్రదించడం ద్వారా జుట్టు సంబంధిత సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని డాక్టర్ స్నేహ పేర్కొన్నారు. బట్ట తల, జుట్టు రాలడం, ఇతర హెయిర్ సంబంధిత సమస్యలు ఉన్నవారు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తమ హాస్పిటల్‌లో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్‌పై అవగాహన అవసరం

పట్నంబజారు: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆ విభాగ డీఎస్పీ ఎం.బాలసుందరరావు చెప్పారు. పాత గుంటూరు పరిధిలోని మహా కవి తిక్కన, ఎస్‌సీకేహెచ్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్లపై సురక్షిత ప్రయాణం చేయాలని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, తద్వారా ప్రమాదాల్ని అరికట్టవచ్చని తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే సమయంలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వన్‌వే, రాంగ్ రూట్ ప్రయాణాలు ఎంతో ప్రమాదకరమన్న విషయం గుర్తించాలని చెప్పారు. ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎం.డి.నిసార్ బాషా మాట్లాడుతూ నిబంధనలు పాటించని పక్షంలో తీసుకునే చర్యల గురించి వివరించారు. అనంతరం ట్రాఫిక్ రూల్స్ పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, నారాయణరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడే మెప్మా సిబ్బందిపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: రుణాల మంజూరులో చేతివాటం చూపించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకాడబోమని మెప్మా పీడీ పి. వెంకట నారాయణ శుక్రవారం ఒక ప్రకనటనలో తెలియజేశారు. డ్వాక్రా గ్రూపు రుణాల మంజూరులో అవకతవకలపై సాక్షి దినపత్రికలో గత మూడు రోజులుగా వస్తున్న వరుస కథనాలపై ఆయన స్పందించారు. రుణం మొత్తాన్ని సంబంధిత సీఎంఎం, టీఎంసీ, సీఓలు, ఆర్పీల శాలరీ నుంచి రికవరీతో పాటు ఇంక్రిమెంట్, ప్రతి ఐదు సంవత్సరాలకు జరిగే రెన్యువల్స్‌ను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్పీ లాగిన్ నిలిపివేస్తూ చర్యలు తీసుకున్నామని తెలిపారు.

కార్పొరేట్ స్థాయిలో జీజీహెచ్ న్యూరాలజీ వార్డు సేవలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులు అత్యుత్తమ ప్రమాణాలతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల్ని పేదలకు ఉచితంగా అందిస్తున్నారని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు.ఆయన శుక్రవారం న్యూరాలజీ వైద్య విభాగాన్ని సందర్శించారు. వార్డు పరిశుభ్రతతో పాటు రోగులకు వైద్యులు అందుబాటులో ఉండటంతో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.వి.సుందరాచారిని సూపరింటెండెంట్ అభినందించారు. వార్డులో పని చేస్తున్న నలుగురు సిబ్బందిని సానిటేషన్ వర్కర్లుగా తీసుకోవాలని ఆదేశించారు. న్యూరో సర్జరీలో మానిటర్లకు, ఈసీజీకి కేబుల్ లేకపోవడం ఇబ్బందిగా ఉందని చెప్పడంతో వెంటనే ఆ విభాగానికి వాటిని అందించారు. క్యాజువాల్టీలో మరణించిన వారిని మార్చురీకి తరలించకుండా ఎక్కువ సేపు అక్కడే ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాజువాల్టీలో వైద్యులు, వైద్య సిబ్బందికి కావాల్సిన సౌకర్యాలు తక్షణమే కల్పించాలని ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని, శామీనా బేగం ఉన్నారు.

డాక్టర్ కిరణ్ కుమార్‌కు సన్మానం

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్‌కు మాదిగ సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ చైర్మన్ కొమ్మూరి కనకారావు శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ కిరణ్ కుమార్ విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు మార్చారని చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌ను కూడా అభివృద్ధి పథంలోకి తీసుకుని వెళుతున్నారని తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఏ.కిశోర్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ వైద్యం అందించాలని కోరారు. ఐద్వా జాతీయ అధ్యక్షుడు జి.రాజా సుందరబాబు మాట్లాడుతూ డాక్టర్ కిరణ్ కుమార్ రాకతో ఆసుపత్రిలో అనేక మార్పులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు పాల్గొన్నారు.

ఫార్మసీ రంగ పరిశోధనలతో ఉజ్వల భవిష్యత్తు

ఐపీఏ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఫార్మసీ రంగంలో పరిశోధనల్ని విస్తృతం చేయడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసిసోయేషన్ (ఐపీఏ) అధ్యక్షుడు డాక్టర్ టి.వి.నారాయణ పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ అమరావతి శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీవీ నారాయణ మాట్లాడుతూ ప్రపంచాన్ని కుదిపేసిన కోవిడ్-19 అత్యవసర పరిస్థితుల్లో భారతదేశ ఫార్మసీ రంగం ఎంతో బలీయమైనశక్తిగా నిలిచి, కరోనా నియంత్రణ వ్యాక్సిన్లు, ఔషధ ఉత్పత్తితో ప్రజల ప్రాణాల్ని కాపాడిందని తెలిపారు. ఫార్మా రంగంలో కరోనాకు ముందు, కరోనాకు తరువాత అనే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఎన్నడూ చూడని విధంగా కొత్త వైరస్‌లు, ప్రాణాంతక జబ్బులకు చికిత్స చేయడంలో సమర్థవంతమైన ఔషధ ఉత్పత్తి ఫార్మా కంపెనీలపై పడిందని పేర్కొన్నారు. దేశంలో ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసిసోయేషన్ 60 శాఖలతో విస్తరించి ఉందని తెలిపారు. ఐఏఐ ద్వారా అధ్యాపకులకు, విద్యార్థులకు అందజేస్తున్న అవార్డ్స్, రివార్డ్స్ గురించి వివరించారు. ఫార్మసీ విద్యార్థులకు వాక్సినేషన్ ట్రెనింగ్, ఫైజర్ సంస్థలో ఇంటర్న్‌షిప్ అవకాశాల్ని తెలియజేశారు. ఐపీఏ ఎడ్యుకేషన్ డివిజన్ చైర్మన్ డాక్టర్ ఎస్. విద్యాధర మాట్లాడుతూ ఫార్మసీ విద్యా విభాగంలో చేపడుతున్న కార్యక్రమాల్ని వివరించారు. కళాశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఐపీఏ శాఖలు మన రాష్ట్రంలోనే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. హిందూ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కోవిడ్-10 అత్యవసర పరిస్థితుల్లో మన దేశం ప్రపంచంలోని 106 దేశాలకు వ్యాక్సిన్ ఉచితంగా అందజేసిందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె. రవికుమార్, ఫార్మా డీ డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐపీఏ అమరావతి శాఖ ప్రారంభోత్సవంలో నారాయణ, రాధాకృష్ణమూర్తి తదితరులు